
హైదరాబాద్ వార్త



## ఉప్పల్ నల్ల చెరువులో దూకి ప్రైవేటు స్కూల్ టీచర్ ఆత్మహత్య

**ఉప్పల్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఒక ప్రైవేటు స్కూల్ టీచర్ ఉప్పల్ నల్ల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ స్వరూప్ నగర్‌లో నివసించే బుదుమ సోమేశ్వర్‌రావు భార్య బుదుమ కృష్ణకుమారి(56) హబ్సిగూడ శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో స్కూల్ అడ్మినిస్ట్రేటర్ పనిచేస్తోంది. అయితే గత మూడు రోజుల క్రితం తన తల్లి ఇంటి నుంచి కనిపించకుండా పోయినట్లు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా కరోనా మహమ్మారి సమయంలో మృతురాలు వెంకటేశ్వర్లు మరణించడంతో సోమేశ్వర రావు అనే వ్యక్తిని తిరిగి వివాహం చేసుకున్నారని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో అప్పులు చేశారని, దానిని తన తల్లి తిరిగి చెల్లిస్తూనే ఉందని తెలిపారు. గత కొన్ని రోజులుగా కృష్ణకుమారి ఆరోగ్యం బాగాలేదని, దీంతో మనస్థాపం చెందినట్లు తెలిపారు. కాగా గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో ఉప్పల్ నల్లచెరువులో ఒక మహిళ చనిపోయినట్లు సమాచారం అందినటు తెలిపారు. దీంతో చెరువు వద్దకు వెళ్లి చూడగా మృతురాలు కృష్ణకుమారి చనిపోయి కనిపించినట్లు తెలిపారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకుందని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న కృష్ణకుమారి

### సాయపడతారా?

# సై అంటారా?

**-ఎంఐఎంకు లక్షకు పైగా మైనార్టీ ఓటర్లు**

**- బిజెపి మినహా ఇతర పార్టీల ఆశలన్నీ వారిపైనే**

**-జూబ్లీ ఉప ఎన్నికలో పోటీపై ఉత్కంఠ**




**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపెన్నికల్లో ఏఐఎంఐఎం(ఆల్ ఇండియా మజ్లిస్- ఎ-ఇత్తెహా దుల్ ముస్లీమిన్) పార్టీ వైఖరి ఈ సారి కీలకంగా మారనుంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో అతి పెద్ద నియోజకవర్గాల్లో ఒకటైన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మైనార్టీల ఓటర్ల సంఖ్య లక్షకుపైగా ఉన్న నియోజకవర్గాల్లో ఇది ఒకటిగా నిలుస్తుంది. 'పతంగి' ఎగురవేయాలని ప్రతి ఎన్నికల సమయంలో పార్టీ భావించినా పొత్తులు, మద్దతుల కారణంగా బరిలో నుంచి తప్పుకోవడమో లేక స్నేహపూర్వక పోటీకి దిగడమో చేస్తుంది. 2014 ఎన్నికల్లో తన బలాన్ని చాటి రెండో స్తానంలో నిలిచింది. ప్రతి సారి ఎన్నికల్లో మైనార్టీ ఓటు బ్యాంకుపై బీజేపీ మినహా ఇతర రాజకీయ పార్టీలు ఆశ పెట్టుకొని ఎంఐఎంతో పొత్తు పెట్టుకొనేందుకు అనేక ప్రయత్నాలు చేసేవి. రానున్న ఉపఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం పార్టీ అభ్యర్థిని నిలుపుతుందా లేక మద్దతునిస్తుందా అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది.

**లక్షకు పైగా ఓటర్లు**

ఎంఐఎం పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో, 2023 ఎన్నికల్లో తమ అభ్యర్థిని నిలిపింది. ఇక 2009లో, 2018లో పార్టీ అభ్యర్థిని నిలపకుండా అధికార పార్టీకి మద్దతునిచ్చింది. దాదాపు లక్షకుపైగా మైనార్టీ ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికల్లో తన ప్రభావాన్ని చూపుతంది. ఇక్కడ నమోదయ్యే మొత్తం ఓట్ల శాతాన్ని గమనిస్తే ప్రతి ఎన్నికల్లో 45 నుంచి 50 శాతం మధ్యలో పోలింగ్ శాతం నమోదు అవుతుంది. ఈ క్రమంలోనే మైనార్టీ ఓట్ల శాతాన్ని సైతం గమనిస్తే ఎన్నికల్లో దాదాపు 40 వేల నుంచి 50 వేల మంది మైనార్టీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈ ఓట్ల శాతం సైతం ఒకే పార్టీకి కాకుండా వివిధ పార్టీలకు సైతం బదిలీ అవుతూ వస్తుంది.

**బరిలో నిలిచేనా..!**

2023లో జరిగిన ఎన్నికల్లో ఎంఐఎం తరుపున షేక్‌పేట డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ రషాద్ ఫరాజుద్దీన్ బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కేవలం 4.28 శాతం ఓట్లతో 7848 ఓట్లను సాధించగలిగింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి మహ్మద్ అజారుద్దీన్ బరిలో నిలవడంతో ఆయనకు 35.03 ఓటు శాతంతో 64212 ఓట్లను సాధించగా బీఆర్‌ఎస్ నుంచి నిలిచిన మాగంటి గోపీనాథ్ 43.94 ఓటు శాతంతో 80549 ఓట్లను సాధించారు. మైనార్టీ ఓట్లు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు బదిలీ అయినట్లు ఈ ఎన్నికల్లో స్పష్టమైంది. 2014లో జరిగిన ఎన్నికల్లో ఎంఐఎం నుంచి బరిలో నిలిచిన నవీన్‌యాదవ్ 25.19 ఓటు శాతంతో 41,656 ఓట్లు సాధించగా, ఆ ఎన్నికల్లో టీడీపీ తరుపున నిలిచిన మాగంటి గోపీనాథ్ 30.78 ఓటు శాతంతో 50898 ఓట్లను సాధించి విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన విష్ణువర్ధన్‌రెడ్డి 20.34 ఓటు శాతంతో 33,642 ఓట్లు సాధించాడు మూడో స్థానానికి పరిమితమయ్యాడు. ఈ క్రమంలోనూ మైనార్టీ ఓట్లు మూడు పార్టీలకు చీలినట్లు స్పష్టమవుతుంది. గత ఎన్నికల్లో అత్యల్ప ఓట్లు రావడంతో ఈ సారి ఎంఐఎం పార్టీ బరిలో నిలుస్తుందా లేక ఇతర ప్రధాన పార్టీకి మద్దతునిస్తుందా అనేది సందిగ్ధంగా ఉంది. అధిష్టానం ఈ విషయంలో ఎలాంటి సంకేతాలు ఇవ్వకున్నా గత ఎన్నికల్లో అభ్యర్థిగా నిలిచిన మహమ్మద్ రషాద్ ఫరాజుద్దీన్ ఇప్పటికే వివిధ డివిజన్లలో పర్యటిస్తున్నారు.

# యెంతకాలం.. ఇలా?

(ప్రభాతవార్త-హైదరాబాద్)

**'వర్షం పడిన ప్రతిసారి తమ పరిస్థితి ఇలాగే ఉంది. ఇంట్లోకి మోకాళ్లలోతు నీరు చేరింది. సామాగ్రి పూర్తిగా తడిసిపోయింది. రాత్రంతా వరద నీటిలోనే గడిపాం'.....ఇది సికింద్రాబాద్ ఈస్ట్ మారేడుపల్లి పరిధిలోని అంబేడ్కర్ నగర్ కాలనీ వాసుల ఆవేదన.**

**'ముప్పై ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో ఉంటూ నరకం అనుభవిస్తున్నాం. మాకు చాలా ఇబ్బంది అవుతోంది. ఎన్ని రోజులు ఈ విధంగా ఇబ్బందులు పడతాం. ఇంతమంది ఉన్నప్పటికీ ఏం చేయలేకపోతున్నారు. మాకు దారిచూపించండి. ఏ ప్రభుత్వం వచ్చినా మాకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు'..ఇది భారీ వర్షాలకు అతలాకుతలం అయిన శ్రీరామ్‌నగర్ కాలనీ వాసుల ఆవేదన.**

నగరాన్ని వరుణుడు వీడటం లేదు. అకాల వర్షాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నగరాన్ని వరదమయం చేసిన వర్షం కాస్త విరామమిచ్చిందనుకునేలోపు గురువారం సాయంత్రం మళ్లీ మొదలైంది. ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిగా నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, శ్రీనగర్ కాలనీ, కృష్ణానగర్ , యూసుఫ్‌గూడ, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట, బోరబండ, చార్మినార్, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర, ఫలక్‌నుమా, బార్కస్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. వరదనీటితో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పంజాగుట్ట మోడల్ హౌస్ ముందు రహదారి చెరువులా మారిపోయింది. మోకాలిలోతు నీరు రావడంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమాజిగూడ సర్కిల్‌కు ఎగువ నుంచి భారీగా వర్షపు నీరు వరదలా వస్తోంది. దీంతో ఖైరతాబాద్, సోమాజిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. అలాగే గతరాత్రి మూడు, నాలుగు గంటలు వ్యవధిలో విరుచుకుపడ్డ వాన ధాటికి నగర జీవనం కకావికలమైంది. గంటల వ్యవధిలోనే రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి ఖైరతాబాద్ లోని ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ లోని పలు కాలనీల్లోకి భారీగా వరదనీరు చేరింది.

- ◆రాత్రంతా మోకాలిలోతు నీళ్లలోనే ఉన్నాం
- ◆30 ఏళ్లుగా వరద ముంపు ఇంతే..
- ◆లోతట్టు ప్రాంత వాసుల ఆవేదన
- ◆నగరాన్ని అతలాకుతలం చేస్తున్న వర్షం
- ◆కుండపోతతో చెరువులవుతున్న రహదారులు
- ◆అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి చేరిన వరద
- ◆మోటార్లతో బయటికి తరలిస్తున్న బల్దియా సిబ్బంది

మిగతా 2లో



శ్రీరాంనగర్ బస్తీలో కుమార్తెను భుజానకెత్తుకుని స్కూలుకు తీసుకువెళతున్న తండ్రి





యూసఫ్‌గూడలో జలమయమైన కాలనీ..సికింద్రాబాద్‌లో కూలిన భారీ వృక్షం

# భారీ అగ్ని ప్రమాదం


**- నగర శివారులో అగ్నికి ఆహుతి అయిన ఫుట్‌వేర్ షాపు**

**-రూ.25 లక్షల ఆస్తి నష్టం**

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఓ ఫుట్‌వేర్ షాపులో జరిగిన ఘటనతో లక్షలాది రూపాయల ఆస్తినష్టం కలిగింది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక జిల్లెలగూడ వివేకానంద స్టాచ్యూ చౌరస్తా పక్కన ఉన్న స్వాగత్ గ్రాండ్ భవనం సెల్లార్‌లోని శ్రీశ్రీ ఫుట్‌వేర్ దుకాణంలో గురువారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరిగి దట్టమైన పొగలు వచ్చాయి. దీంతో సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలనార్పాయి. స్థానిక మీర్‌పేట్ పోలీసులు సైతం అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. షాపులో దీపం కారణంగానో లేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ సంఘటనలో దాదాపు రూ.5 లక్షల మేర ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని ఫైర్ అధికారులు భావిస్తున్నారు. అయితే షాపు యజమాని మాత్రం విలువైన షూలు, చెప్పులు తదితర వస్తువులు రూ.20 లక్షల వరకు అంతే కాకుండా ఫర్నీచర్ మరో రూ.5 లక్షల వరకు మొత్తం కలిపి రూ.25 లక్షల నష్టం కలిగిందని వెల్లడించారు. కేసును నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సిఎండీ ముషారఫ్

## కోర్టు ప్రాంగణంలో కొత్తసబ్‌స్టేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** రాజేంద్ర నగర్, అగ్రికల్చరల్ యూనివర్సిటీ దగ్గర్లో నూతన హైకోర్ట్ భవనం నిర్మించ తలపెట్టిన ప్రతిపాదిత స్థలాన్ని, రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని వివిధ బస్తీలను గురువారం దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్, సిఎండీ ముషారఫ్ ఫరూఖీ సందర్శించారు. ఈసందర్భంగా కోర్ట్ నిర్మించ తలపెట్టిన ప్రతిపాదిత స్థలంలో నిర్మాణాలకు అడ్డుగా వున్న 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టి లైన్‌ల తొలగింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా, కోర్ట్ ప్రాంగణంలో ఒక విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని సంబంధిత అధికారులను కోరారు. దీని వలన హై కోర్ట్‌తో పాటు పక్కన వున్న కాలనీలకు, బస్తీలకు ప్రయోజనకరంగా వుంటుందన్నారు. అలాగే రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని వినాయక్ నగర్ బస్తీ, శివరాంపల్లి ప్రాంతంలోని పలు బస్తీలలోనూ పర్యటించారు. ఎల్‌టి ఓవర్ హెడ్ కండెక్టర్ల స్థానంలో ఎయిర్ బంచ్డ్ కేబుల్ ఏర్పాటు పనులను పరిశీలించారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే 10 కిలో మీటర్ల మేర ఎయిర్ బుంచెడ్ కేబుల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా బస్తీ బాట కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది బస్తీలోని ప్రతి గల్లీని క్షుణ్ణంగా పరిశీలించాలని కింది స్థాయిలో ముందు జాగ్రత చర్యలు చేపడితే అంతరాయాలకు గాని, విద్యుత్ ప్రమాదాలు వంటివి నివారించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సీఎండీ తో పాటు, సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్) డా. నరసింహులు, సూపెరింటెండింగ్ ఇంజినీర్ మోహన్, డివిజనల్ ఇంజినీర్ పి రత్నాకర్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో పరిష్కారం

**యుద్ధప్రాతిపదికన వరద నీరు మళ్లింపు**

**శ్రీరాంనగర్ నుంచి హుస్సేన్‌సాగర్‌కు ప్రత్యేక నాలా నిర్మాణం**

**హైడ్రా కమిషనర్ ఆదేశం- మోటార్లు పెట్టి తోడుతున్నా నీళ్లు పోవడంలేదని వరద బాధితుల ఆవేదన**

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** నగరంలో నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం పరిశీలించారు. అమీర్‌పేటలోని గాయత్రి కాలనీ, మాధాపూర్‌లోని అమర్ సొసైటీ, బాగ్‌లింగంపల్లి లోని శ్రీరాంనగర్‌లలో హైడ్రా కమిషనర్ పర్యటించారు. అమీర్‌పేట వద్ద కాలువల్లో పూడిక తీయడంతో సాఫీగా వరద సాగుతోందని ఇదే మాదిరి నగరంలోని అన్ని చోట్ల నీటి మునకకు మూలాలను తెలుసుకుని సమస్య పరిష్కరించాలని హైడ్రా కమిషనర్ సూచించారు. పై నుంచి భారీ మొత్తంలో వస్తున్న వరద నీరు మైత్రి వనం వెనుక ఉన్న గాయత్రినగర్‌ను ముంచెత్తుతోందని.. ఇక్కడ కూడా కాలువలలో సిల్ట్ తొలగించి వరద ముప్పు సమస్యతను తొలగించాలని అక్కడి నివాసితులు కమిషనర్‌ను కోరారు. పై నుంచి నాలాల్లో పూడిక తీసుకుని వస్తున్నామని.. ఇక్కడ కూడా పరిష్కార చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఏవీ రంగనాథ్‌గారు హామీ ఇచ్చారు.

దుర్గం చెరువులో నీటి మట్టం పెరగడంతోపై భాగంలో ఉన్న అమర్ సొసైటీతో పాటు అనేక కాలనీలుకు వరదనీరు పోటెత్తుతోందని స్థానికులురంగనాథ్‌కి తెలిపారు. చెరువు నీటి మట్టం తగ్గిస్తే కొంతవరకు సమస్య పరిష్కారమోతుందని సూచించారు. ఈ విషయమై ఇరిగేషన్, జీ హెచ్ ఎంసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. క్లౌడ్ బరస్ట్ తో అనూహ్యంగా గంట వ్యవధిలోనే 15 సెంటీమీటర్లకు పైగా వర్షం పడడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. ఆ పరిస్థితులను తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కమిషనర్ సూచించారు. బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్లో వరద నీరు పోయేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ సూచించారు. ఇందుకు గాను శ్రీరాంనగర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరద కాలువలో కలిసేలా ప్రత్యేక నాలాను నిర్మించాలన్నారు. నేరుగా హుస్సేన్ సాగర్ వరద కాలువలో కలపకుండా.. కొంతదూరం కొనసాగించి నాలాను కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఉన్న నాలాను బంద్ చేసి.. అక్కడ ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేస్తున్నారని.. ఆ నాలాను పునరుద్ధరిస్తే వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు. శ్రీరాంనగర్‌లో వందలాది గృహాలకు దారి లేకుండా పోయిందని నడుం లోతు నీటిలో ఇళ్లకు ఎలా వెళ్లేదని స్థానికులు కమిషనర్ ముందు వాపోయారు. మోటార్లు పెట్టి తోడుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదని.. ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలోంచి నాలాను తీసుకెళ్లి హుస్సేన్‌సాగర్ వరద కాలువలోకలిపాలని కోరారు.



వరదనీటి నాలాను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్



బృందావన్‌కాలనీలో నీటమునిగిన కార్లు

## 70కిలోమీటర్లు కొట్టుకుపోయిన మృతదేహం

**- ఐదురోజుల క్రితం హబీబ్‌నగర్‌లో వరదకు డ్రైన్‌జీలో పడిన అర్జున్**

**-యాదాద్రి జిల్లా సంగెం వద్ద మూసీలో మృతదేహం లభ్యం**

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఐదురోజుల క్రితం హబీబ్‌నగర్ అఫ్జల్ సాగర్ డ్రైనేజీలో ఆదివారం భారీ వర్షానికి మామ, అల్లుడు కొట్టుకుపోయిన సంగతి తెలి సిందే. అప్పటి నుంచి గాలింపు చర్యలు కొనసాగుతుండగా గురువారం అందులో ఒకరి మృదేహం లభ్యమైంది. యాదాద్రి జిల్లా వలి గొండ మండలం సంగెం భీమలింగం కత్వా వద్ద మూసీ ప్రవాహంలో కొట్టుకువచ్చిన అర్జున్ మృతదేహాన్ని సహాయక సిబ్బంది గుర్తించారు. వెంటనే సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడి బయలుదేరి వెళ్లారు. మరొకరి మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అలాగే గత ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ముషీరాబాద్ వినోభా నగర్‌కు చెందిన దినేశ్, మల్లేపల్లి అఫ్జల్ సాగర్‌కు చెందిన అర్జున్, రాము వరద నాలాలో కొట్టుకుపోయారు. హైడ్రా, జీహెచ్ ఎంసీ సిబ్బంది గత 5రోజులుగా వరద నాలాలను జల్లెడపట్టినా ఫలితం దక్కలేదు. గౌలిగూడ నుంచి ఎంజీబీఎస్, చాదర్‌ఘాట్, ముషారాంబాద్ మీదుగా నాగోల్ వరకు వెతికామని సహాయక సిబ్బంది తెలిపారు. అయినా బాధితుల జాడ లభించలేదు. ఇవాళ నల్గొండ జిల్లాలోని మూసీ నదిలో అర్జున్ మృతదేహం లభ్యమైంది. అతనితో పాటు మిస్ అయిన రాము మృతదేహం కోసం అదే ప్రాంతాల్లో డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు.

## నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం

**బృందావన్ కాలనీలో వరద బాధితుల గగ్గోలు**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:** కుండపోత వర్షంతో నడుము లోటు వర్షపు నీటి ప్రవాహంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని బాగ్‌లింగంపల్లి లోని బృందావన్ కాలనీ వాసులు గగ్గోలు పెట్టారు. గత కొన్ని రోజుల నుంచి ఎడదెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో కాలనీ మొత్తం నీటమునిగింది. సంబంధిత జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావడంతో గురువారం జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ రామానుజ రెడ్డి బృందావన్ కాలనీలో పర్యటించి కాలనీ వాసులతో వారి సమస్య గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. గతం వరం రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పరిసర ప్రాంతాలలోని వర్షపు నీరు బృందావన్ కాలనీ లోని సెంట్ గాబ్రియేల్ ఉన్నత పాఠశాల వీధిలోకి ప్రవహించి ఇండ్లల్లో నడుములోతు వర్షపు నీటిలో నివాసితులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, పాఠశాల ఎదురుగా ఉన్న పోచమ్మ దేవస్థానంతో పాటు, తమ ఇండ్లలోని నిత్యావసర సరుకులు సైతం వర్షపు నీటిలో మునిగిపోయాయని, తమ సమస్యకు వెంటనే పరిష్కారం చూపించాలని కాలనీ వాసులు జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమీషనర్‌కి గోడు వెళ్లబోసుకున్నారు.

### ముంపు నివారణలో వైఫల్యం

ఎడదెరిపి లేకుండా కురిసిన భారీవర్షాఆనికి బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్ బస్తి,కమాన్ బస్తి నీటిలో మునిగింది. బస్తి వాసుల ఇండ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. జిహెచ్‌ఎంసి అధికారులు తక్షణమే నివారణ చర్యలు చేపట్టడంలో తీవ్ర నిరక్ష ్యంగా వ్యవహరించడంతో ప్రజ లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత అనేక ఏండ్లుగా వర్షాలకు శ్రీరామ్ నగర్ బస్తీ నీట మునిగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నా అధికారులు నివారణ చర్యలు తీసుకోవడం లేదు. ఇతర లోతట్టు ప్రాంతాల్లోనూ ఇలాంటి సమస్యలే ఉత్పన్నమవుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ, నష్ట నివారణ చర్యలు చేపట్టడంలో అధికారుల నిరక్ష ్యం కొనసాగుతుంది. వర్షాకాలంలో వర్షపు నీటితో పాటు, హుస్సేన్ సాగర్ నుండి ప్రవహించే వరద నీళ్ల ప్రవాహం శ్రీరామ్ నగర్ బస్తీలోని ఇండ్లలోకి వస్తున్న విషయాన్ని కాలనీవాసులు ప్రభుత్వ అధికారులకు విన్నవించినప్పటికీ ఏమా త్రం పట్టించుకోవడంలేదు. డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలి. వర్షపు నీళ్ళు వచ్చి చేరడంతో కాలనీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళలేని పరిస్థితి. వాహనాలు నీట మునిగింది. వర్షపు నీళ్ల ప్రవాహంతో ఇండ్ల నుండి బయటకు రాలేక సతమతమవుతున్నారు. వర్షపు నీళ్ళు,మురికి నీళ్లతో విషపు జ్వరాలు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. భారీగా కురిసిన వర్షానికి ఇండ్లలోకి చేరిన నీటి వల్లన కొందరిండ్లలో నిత్యవసర వస్తువులు సరుకులు తడిశాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జ్యోతి నగర్ కాలనీ కమాన్ ప్రారంభం




బోడుప్పల్ జ్యోతి నగర్ కాలనీ కమాన్ ప్రారంభిస్తున్న తోటకూర వజ్రేష్ యాదవ్ , అజయ్ యాదవ్ , గుర్రాల రమ వెంకటేశ్ యాదవ్ , తదితరులు

**బోడుప్పల్ ,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త ;** బోడుప్పల్ 24వ డివిజన్ లో మాజీ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేష్ యాదవ్ సొంత నిధులతో జ్యోతి నగర్ కాలనీ కమాన్ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రారంభించిన మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ , బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్, బింగి జంగయ్య యాదవ్, జక్కా రాములు, సీసా వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు , పాల్గొన్నారు

## దసరాలోపు ప్రజలకు మంచినీళ్ళు అందించి దప్పిక తీర్చండి
### గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేయండి



పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వరరావు కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి, తదితరులు

**మేడిపల్లి , సెప్టెంబర్ 18 ప్రభాతవార్త ;** పీర్జాదిగూడ నగర ప్రజలకు దసరాలోపు మంచినీళ్ళు అందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావుకు మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ నగరంలోని పలు కాలనీలలో ప్రజలు ఏదురుకుంటున్న సమస్యలపై మాజీ కార్పొరేటర్లు, ప్రజలు, స్థానిక నాయకులతో కలిసి కమిషనర్ త్రిలేశ్వర్ రావుకి కలిసి వినతిపత్రం అందజేసారు. మల్లారెడ్డి మాట్లాడుతూ ... దసరా పండుగ లోపు ప్రజలకు మంచినీళ్లు అందించాలని అవసరమైన చోట నూతన పైప్ లైన్ ఏర్పాటు చేయాలని,సిసి రోడ్డు, డ్రైనేజి వంటి మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన పనులు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు.కమీషనర్ సానుకూలంగా స్పందంచారని అన్ని పనులకు టెండర్ వేశారని, సమస్యలు అన్ని ముందే అంచనా వేశారని దసరా లోపు అన్ని పనులు పూర్తిచేస్తారని హామి ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతురి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, జావీద్ ఖాన్,జిలాని పాషా, కోనేటి వెంకట్, యాసారంశ్రీనివాస్, అమర్ పటేల్, బత్తుల కిరణ్,వివిధ కాలనీల నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీని వెంటనే ప్రారంభించాలి
### - ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



ఏసిఎస్ఓకు వినతిపత్రంనఅందజేస్తున్న ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:** సర్కిల్-1 పరిధిలో రేషన్ కార్డుల పంపిణీని వెంటనే ప్రారంభించాలని కోరుతూ హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ గురువారం అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి నర్సింగ్ రాజ్‌కు వినతిపత్రంనఅందజేశారు. అనంతరం కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంత్సరాలలో ఒక్క కొత్త రేషన్ కార్డును కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరస రఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి రేషన్ కార్డును ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని ముందు కు వెళ్తున్నారని అన్నారు. అయితే సర్కిల్ 1 పరిధిలో మల క్‌పేట, యాకుత్‌పుర నియోజకవర్గాల పరిధిలో కొత్త రేషన్ కార్డు ల పంపిణీ చేపట్టడం లేదని, ఇది పూర్తిగా అధికారుల నిర్లక్ష్య మేనని ఆయన పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను చేపట్టాలని కోట్ల శ్రీనివాస్ కోరారు.


## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానంన



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:** ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు లతారాణి, మాధురిలకు గురువారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటి మేయర్ సుభాష్ చందర్జీ, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్‌లు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధ్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయుల అంకిత భావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సూరజ్ అప్సింగికర్, అరవింద్ గౌడ్, నీరజారెడ్డి, స్మిత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సు సర్వీసు పునః ప్రారంభం



**సరూర్‌నగర్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 13వ డివిజన్ పరిధి కిందకు వచ్చే సుల్తాన్‌పూర్ గ్రామానికి దాదాపు ఆరు సంవత్సరాల తర్వాత ఆర్టీసి బస్సు సర్వీసు పునః ప్రారంభమైంది. బస్సు సౌకర్యం లేని కారణంగా గ్రామస్తుల అవస్థలపై కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామ కృష్ణారెడ్డి నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆయన మిథాని డిపో అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో డిపో మేనేజర్ ఆర్టీసి బస్సు సర్వీసును పునరద్ధరించాలని నిర్ణయించారు. దీంతో గురువారం నుండి సుల్తాన్‌పూర్‌కు 102 ఎం బోర్డుతో ఆర్టీసి బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గ్రామస్తులు బిజెపి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై కమిషనర్ చర్యలు తీసుకోవాలి : మంద సంజీవరెడ్డి

-బోడుప్పల్‌లో ఫోటో కాల్ రగడ
-బోడుప్పల్ కార్పొరేషన్ ముందు బిఆర్ఎస్ నాయకులు ధర్నా



బోడుప్పల్ కమిషనర్ శైలజకు వినతిపత్రం అందిస్తున్న మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి , బిఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ,మాజీ ప్రజాప్రతినిధులు

**బోడుప్పల్ ,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అధికారికంగా నిర్వహించే కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించరా ? స్థానికంగా అనేక అక్రమ షెడ్ల నిర్మాణాలు జరుగుతుంటే చర్యలు తీసుకోరా ?బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి కమీషనర్ ని ప్రశ్నించారు.ఈ సందర్భంగా సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో బోడుప్పల్ కమిషనర్ శైలజని తన ఛాంబర్ లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంద సంజీవ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించడం లేదని,స్థానిక ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంపీ,ఎమ్మెల్యేలకు మాజీ బిఆర్ఎస్ కార్పొరేటర్లకు ఆహ్వానం లేకుండానే కార్యక్రమాలు నిర్వహించడం పై మండిపడ్డారు. బోడుప్పల్ ఏ గల్లీలో చూసిన అక్రమ షెడ్ల నిర్మాణాలు అధికారులకు కనిపించడం లేదా ? అని ప్రశ్నించారు. ఇలానే కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కమీషనర్ సానుకూలంగా స్పందించారని,రానున్న రోజులలో జరుగు కార్యక్రమం లో ప్రోటోకాల్ పాటిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బిఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, కొత్త చక్రపాణి గౌడ్ కాటపల్లి రామ చంద్రారెడ్డి బందారం శ్రీధర్ గౌడ్, 15వ డివిజన్ ఇంచార్జ్ సిగురు రేణుక రవికుమార్ ముదిరాజ్ బిఆర్ఎస్ యూత్ నాయకుడు సామల మనోహర్ రెడ్డి , అస్లాం , ఉప్పరి విజయ్, శత్రుఘ్న ,జనిగే శివ యాదవ్ , వివిధ కాలనీల అధ్యక్షులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలు : సిపిఎం




మీర్‌పేట్ చౌరస్తాలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సభలో ప్రసంగిస్తున్న సిపిఎం నాయకుడు : చిత్రంలో దాసరి బాబు, యాదగిరి చారి తదితరులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ చౌరస్తాలో బాలాపూర్ మండల సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హాజరైన పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుబ్బాక రాంచందర్, జిల్లా కమిటీ సభ్యుడు గోరెంకల నర్సింహ తదితర వక్తలు మాట్లాడుతూ నాటి నిజాం నిరంకుశత్వ పాలనలో జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌ల ఆగడాలకు వ్యతిరేకంగా గళం విప్పి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది పలికింది నాటి కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆనాటి దురాగాతాలు, పోరాటాల గురించి వారు వివరించారు. నాటి పోరాట చరిత్రను వక్రీకరించడాన్ని వారు ఖండించారు. నాటి పోరాట స్ఫూర్తితో సిపిఎం ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుందని వారు తెలిపారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల కన్వీనర్ ఎం.యాదయ్య, సభ్యులు దాసరి బాబు, శేఖర్ యాదవ్, ఎలేష, సీనియర్ నాయకులు సుంకోజు యాదగిరి చారి, టివికె రాజు, ధనంజయ, వెంకయ్య, కిషన్, మల్లికార్జున్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్‌కు రూ.11.13 కోట్ల నిధులు : ఎం.రజితరెడ్డి



**ఉప్పల్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఉప్పల్ డివిజన్‌లో మరో సారిగా భారీగా నిధులు మంజూరు అయినట్లు స్థానిక కార్పొరేట ర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.11.13 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఉప్పల్ నల్ల పొచమ్మ దేవాలయం నుంచి శాంతి నగర్ వరకు బాక్స్ కల్వర్ట్ నిర్మాణం కోసం రూ. 85 లక్షలు, సత్యనగర్‌లో ఎల్ అండ్‌టి కల్వర్ట్ వద్ద బాక్స్ కల్వర్ట్ నిర్మాణం కోసం రూ.85 లక్షలు, హిందూ స్మశాన వాటిక నుండి భరత్‌నగర్ మాల బస్తీ వరకు పైప్ లైన్ వేసేందుకు రూ.కోటి 25 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. అదే విధంగా పాత ఉప్పల్ సీవరేజ్ డ్రెయిన్‌ల రీమోడలింగ్ కోసం రూ.90 లక్షలు, సూర్యనగర్, వెంకటేశ్వర కాలనీ, రాఘవేంద్ర కాలనీలలో సీవరేజ్ డ్రెయిన్‌ల వేసేందుకు రూ.40 లక్షలు మంజూరు అయి నట్లు తెలిపారు. అదే విధంగా లక్ష్మారెడ్డి కాలనీలో దెబ్బ తిన్న సిసి రోడ్ల నిర్మాణానికి రూ.64 లక్షలు, సంతోషి మాత ఆలయం నుండి కావేరి నగర్ కల్వర్ట్ వరకు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 60 లక్షలు, ఉప్పల్ ఐడిఏ వద్ద నుంచి కృష్ణా కెమికల్స్ నుండి నాలా లక్ష్మీ నారాయణ కాలనీ, శ్రీరమణపురం వరకు సిసి రోడ్డు నిర్మా ణం, నీటి ని ల్వ సమస్య తొలగింపు కోసం రూ.60 లక్షలు మంజూరు అయ్యాయని ఆమె తెలిపారు.పాత ఉప్పల్ గ్రామంలో దెబ్బతిన్న సిసి రోడ్లు వేసేందుకు రూ.కోటి 15 లక్షలు, వరంగల్ జాతీయ రహదారిని కలిపే లింక్ రోడ్ల కోసం రూ.79 లక్షలు, వెంకటేశ్వర టెంపుల్ కమాన్ నుండి స్వరూప్ నగర్ వరకు పైప్ లైన్ పునరుద్ధరణ కురూ.42 లక్షలు, ఉప్పల్ భరత్ నగర్, శ్రీరామ కాలనీ, కావేరి నగర్‌లలో సిసి రోడ్లు వేసి నీటి నిల్వ తొలగింపు కోసం రూ.కోటి 20 లక్షలు, ఉప్పల్ సూర్య నగర్ కాలనీ లో దెబ్బతిన్న రోడ్లు వేసేందుకు రూ.48 లక్షలు మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. నిధులు విడుదల చేసేందుకు చొరవ తీసుకున్న సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉప్పల్ సర్కిల్‌లో బిజెపి నేతల స్వచ్ఛ భారత్ ఉత్సవాలు




ఉప్పల్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** భారత ప్రధాని నరేంద్ర మోడి జన్మదినం సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో సేవా పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ విజయపురికాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యమ్రకంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, రావుల బాల కృష్ణ గౌడ్, బొంగు రమేష్ గౌడ్, ఏసూరి యాదగిరి, కొల్లు బాలరాజు, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, వర్కల రాజేందర్ గౌడ్, సింగారం కార్తీక్, ఎల్లగొని ప్రకాష్ గౌడ్, ఫకీర్ నర్సిరెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బి.రాజేష్ గౌడ్, గొరిగె శ్రీకాంత్,నవీన్ గౌడ్, రావుల అఖిలేష్ గౌడ్,శ్రీరామ్ విజయ్, ఎర్ర శ్రీనివాస్, విజయ్ గౌడ్, సంతోష్ గౌడ్, తెల్కల నరసింహ రెడ్డి పాల్గొన్నారు

**రామంతాపూర్‌లో :** రామంతపూర్ డివిజన్ బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రేవ నరసింహ కురుమ, ఉప్పల్ అసెంబ్లీ ఓబీసీ మోర్చ కో కన్వీనర్ వేముల తిరుపతయ్య ఆధ్వర్యంలో చిన్న చెరువు పాండురంగ స్వామి దేవాలయ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చెరువు సమీపంలో పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు ముత్తినేని జగదీష్, బండారు వెంకటరావు, వల్లపు జగన్ యాదవ్, కాపర్తి మోహన్ కృష్ణ, తాళ్ల బాలకృష్ణ గౌడ్, కల్మకల లింగం, పడిగం నగేష్, దయాకర్ రెడ్డి, బొడ్డుపల్లి ముత్యం, రామబ్రహ్మం, తమ్మల రవి, వీణ, శీలం సుధా, వెంపటి రామ్ రాజ్, మసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బాలాజీ రాం స్వరూప్, కొంపెల్లి ఉపేందర్, బొడ్డుపల్లి ఆనంద్, జక్క పర్వతాలు, రావుల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు : కార్పొరేటర్




నిర్మాణంలో ఉన్న ఓపెన్ జిమ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. సెప్టెంబర్.18.ప్రభాతవార్త.** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీలో జరుగుతున్న ఓపెన్ జిమ్ పనులను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ విభాగం డిఈ దామోదర్ రావు గారితో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ఓపెన్ జిమ్ వ్యాయామాలు చేయడం ద్వారా శరీరం, మనస్సు మరియు మానసిక స్థితిని ఉత్తేజపరుస్తాయి అని అన్నారు మరియు త్వరలోనే ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ కార్తీక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ మరియు తదితరులు ఉన్నారు.

### పార్కులో బోర్ వెల్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్

బి.ఎన్. రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ పార్కులో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీ అధ్యక్షుడు పి. కృష్ణ తో కలిసి బోర్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మాచారి,గౌరవాధ్యక్షుడు ఏ.రామాచారి,కోశాధికారి బి.సీను,వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు వెంకటేష్ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## మిగులు భూములు పేదలకు పంచాలి: సీపీఐ



**హయత్ నగర్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** భారత స్వాతంత్ర ఉద్యమం నుండి మొదలుకుని ప్రత్యేక తెలంగాణ సాధన వరకు కమ్యూనిస్టుల పాత్ర మరువ లేనిదని సీపీఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా రావి నారాయణరెడ్డి భూపోరాట కేంద్రంలో ఏర్పాటు చేసిన ముగింపు సభలో వారు మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు నాయకులు చేసిన సాయుధ పోరాటం వల్లనే 1948 సెప్టెంబర్ 17 న హైదరాబాద్ సంస్థానానికి, తెలంగాణ ఉమ్మడి పది జిల్లాలకి స్వాతంత్రం లభించిందన్నారు. కుంట్లూరు భూపోరాట కేంద్రంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలందరికీ ప్రభుత్వం వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, అజ్మీర హరి సింగ్ నాయక్, పల్లె నరసింహ, శ్రీదే వి, వంశీ వర్ధన్ రెడ్డి, కేతరాజు నరసింహ పాల్గొన్నారు

## నార్ముల్ మదర్ డెయిరీలో ప్రారంభమైన పాలకవర్గ ఎన్నికల ప్రక్రియ



బోర్డు హాలులో నామినేషన్ వేస్తున్న కర్నాటి జయశ్రీ.

**హయత్ నగర్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** నార్ముల్ మదర్ డెయరీ లో ఈ నెలాఖరుతో ఖాళీకానున్న మూడు పాలక వర్గ స్థానాలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమయ్యింది. ప్రస్తుత పాలకవర్గ సభ్యులు కర్నాటి జయశ్రీ, చల్లా సురేందర్ రెడ్డి, రచ్చ లక్ష్మి నర్సింహారెడ్డి ల పదవీకాలం ఈ నెలాఖరుతో పూర్తికానుంది. ఈ క్రమంలో రెండు జనరల్, ఒక జనరల్ మహిళా స్థానానికి ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జరిచేశారు. గురువారం ప్రారంభమయిన నామినేషన్ల ప్రక్రియలో రెండు జనరల్ స్థానాలకు ఎనిమిది మంది నామి నేషన్లు దాఖలు చేయగా... ఒక జనరల్ మహిళ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. 19న కూడా నామినేషన్ల దాఖలు ప్రక్రియ కొనసాగనుంది. 20న నామినేషన్ల పరిశీలన, 22న నామినేషన్ల ఉపసంహారణ ఉంటుందని ఎన్నికల అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. ఏకగ్రీవం కాని పక్షంలో ఈ నెల 27న ఎన్నికలను నిర్వహించనున్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఈటెల రాజేందర్, సుమన్ గౌడ్

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారం అవుతామని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, రంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యుడు బత్తుల సుమన్ గౌడ్ పేర్కొన్నారు. బిజెపి ఆధ్వర్యంలో సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ గౌడ్ శిబిరంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా బిజెపి నాయకులు కార్యకర్తలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పార్ల శివ, వెంకటేష్ మామ, భార్గవ మధు, రమణ పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం కాపాడటం సమాజ అభివృద్ధికి పునాది



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 18,ప్రభాతవార్త:** మహిళల ఆరోగ్యం కాపాడటం ద్వారానే సమాజం సుస్థిర అభివృద్ధి సాధిస్తుంది" అని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు .వినాయక్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళ పోషణోత్సవం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ - గర్భిణీ స్త్రీలు సమయానికి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, మోనోపాజ్ సమస్యలు ఉన్న మహిళలు వైద్యుల సూచనలు పాటించాలన్నారు. కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే మహిళల పోషణకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గర్భిణీ మహిళలు, గైనక సమస్యలు ఉన్నవారికి ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్వేతా, యుపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ భవన్, డాక్టర్ బాబన్న పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, జగదీష్ చారి, సాయి సురేష్, మల్లేష్ యాదవ్, గోపాల్ యాదవ్, సాయి జ్యోతిర్మయి తదితరులు కూడా పాల్గొన్నారు.

## రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న మడిగెల లక్ష్మారెడ్డి తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని బిజెపి కిసాన్ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు మాడిగెల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని మడిగెల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గడ్డి అన్నారంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా రక్తదానం గొప్పదని, రక్తదానం చేయడంతో విలువైన ప్రాణాలను కాపాడిన వారమవుతమన్నారు. సమాజానికి తమ వంతు సేవ చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొత్త కాపు రవీందర్ రెడ్డి, వనపర్తి రమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు లక్కీ జెన్స్ ఛారిటబుల్ ట్రస్టు సహకారం



స్కూలు బ్యాగులు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ, నాయకులు పరమేష్ కుమార్

**సైదాబాద్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:** లక్కీ జెన్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్ ఆనంద్‌మార్గ్ పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు, డిక్షనరీలను బిజెపి రాష్ట్ర నాయకులు సంగోది పరమేష్ కుమార్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ రాజేంద్రప్రసాద్, రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ రాజ్యలక్ష్మి, ప్రసాదరావు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న ఉపేందర్ రెడ్డి, వైద్యులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్థ నారి శక్తి కుటుంబ అభియాన్ ప్రత్యేక ఆరోగ్య శిబిరంలో యుపిహెచ్ సి సెంటర్ పార్క్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. శిబిరంలో మహిళలు, పిల్లలకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య శిబిరాన్ని సందర్శించిన అదనపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ డాక్టర్ రంగారెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ గీత, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ కుసుమ, వైద్యసిబ్బంది పలువురికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమానికిప్రత్యేక అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకా ఉపేందర్ రెడ్డి, ఆర్కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి హాజరై వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏ. సాయికుమార్, కె. శ్యామ్ సుందర్ రావు, కె.రామా రావు, బి. వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది రంజిత్‌కుమార్, విజయేందర్ రెడ్డి, ప్రదీప్, నీరజ, జ్యోతి, కరణ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

## బ్యాంక్ కాలనీలో స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనులు



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ బ్యాంక్ కాలనీలో రూ.70లక్షల వ్యయంతో చేపడుతున్న స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనులను గురవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ బ్యాంక్ కాలనీలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ నిర్మాణంతో సుమారు పది కాలనీల వరద నీరు వెళ్లేందుకు వీలు ఉంటుందన్నారు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాణ్యత పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్ కాలనీ అధ్యక్షుడు గపూర్, కార్యదర్శి సందీప్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా సేవా కార్యక్రమాలు : కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండా కార్తీక రెడ్డి, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని విస్తృతంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ముసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవ పక్ష కార్యక్రమాలలో భాగంగా ముసారాంబాగ్ కృష్ణ తులసి నగర్ లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ బండా కార్తీక రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ ఆదేశానుసారం అక్టోబర్ 2వ తేదీ వరకు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో కులం, మతంతో సంబంధం లేకుండా జాతీయ ఐక్యత, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడం ద్వారా ప్రజలను ఏకం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బొక్కా మధుసూదన్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు సం రెడ్డి రెడ్డి సురేందర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జి, నాయకులు సందడి సురేందర్ రెడ్డి, వేమూరి రామ్ కోటేశ్వరరావు, గౌర దేవేందర్ అనుముల భరత్, దినేష్, తులసి పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ బాధిత కుటుంబానికి పారిజాత పరామర్శ



జిల్లెలగూడ సాయికృపానగర్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగిన బిచ్యా నాయక్ గృహాన్ని పరిశీలిస్తున్న పారిజాత: చిత్రంలో పోరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ సాయికృపానగర్ కాలనీలో విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాన్ని గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరామర్శించారు. జిల్లెలగూడ మాజీ ఎంపిటిసి పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, యువ నాయకుడు పోరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులతో కలిసి ఆమె విద్యుత్ షాట్ సర్క్యూట్‌కు గురై ఆస్తి నష్టం జరిగిన బిచ్యా నాయక్ గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలిపోయిన విద్యుత్ గృహోపకరణాలు, మీటర్లు, స్విచ్ బోర్డులను పరిశీలించారు. ఈ మేరకు బాధితులను పరామర్శించిన ఆమె ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బల్వంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.